# రాజుగారికో న్యాయం

విజయపురి కొత్వాలుకి రాణీగారి దగ్గర్నుంచి కబురు వచ్చింది. తనతో రాణీ గారికి ఏం పని పడిందో అర్థం కాక వెంటనే వెళ్ళి దర్శనం చేసుకున్నాడు కొత్వాలు.

"కొత్వాలుగారూ! మా చెలికత్తె మల్లిక బంగారు చంద్రహారం ఎవరో దొంగిలించారు" అన్నది రాణీ గారు.



"దొంగతనం ఎలా జరిగింది మహారాణీ?" అని అడిగాడు కొత్వాలు.

"ఆ వివరాలన్నీ మల్లికను అడిగి తెలుసుకోండి. మీరేం చేస్తారో మాకు తెలియదు. పోయిన చంద్రహారం తిరిగి మల్లికకు ఇప్పించే బాధ్యత మీదే".

రాణీగారు అతని సమాధానం ఆశించకుండా అంతఃపురంలోకి వెళ్ళి పోయింది. మల్లిక వచ్చి కొత్వాలుకి నమస్కారం చేసింది.

"మల్లికా! నీ చంద్రహారం ఎక్కడపోయింది? ఎలా పోయింది? వివరంగా చెప్పు" అని మల్లికను అడిగాడు కొత్వాలు.

"రాత్రి ఏలేశ్వరం స్వామి గుడికి వెళ్ళాను. శివరాత్రి జాతర చూడడానికి జనం ఇసుక వేస్తే

రాలనట్లు వచ్చారు. నాతో పాటు మరికొందరు చెలికత్తెలు వచ్చారు. అందరం చాలా చోట్ల తిరిగాం. నృత్యగానాలు, తోలు బొమ్మలాటలు చూశాం. ఇంటికి తిరిగి వెళ్ళేటప్పుడు చూసు కున్నాను. నా మెడలో వుండాల్సిన చంద్రహారం లేదు. వెనక్కి వెళ్ళి చాలా చోట్ల వెతికాం. ఎక్కడా దొరకలేదు" చెప్పింది మల్లిక.

"సరే నేను విచారిస్తాను" అని ఠాణాకు వెళ్ళి పోయాడు.

కొత్వాలు ఆలోచనలో పడిపోయాడు. శివ రాత్రికి జరిగే ఏలేశ్వరం జాతరకి వేల సంఖ్యలో భటులను కాపలా పెట్టినప్పటికీ యథేచ్ఛగా దొంగ తనాలు జరిగిపోయాయి. సొమ్ము పోగొట్టుకున్న వాళ్ళు ఠాణాకు వచ్చి మొర పెట్టుకున్నారు. చేసే దేం లేదు. కొత్వాలు తన ప్రయత్నం తను చేయ సాగాడు. విజయపురిలో చిన్న, పెద్ద దొంగలను పిలిపించి నయానా, భయానా బెదిరించాడు చంద్రహారం జాడ చెప్పమని. లాభం లేక పోయింది. ఆ చంద్రహారం తామెవ్వరం దొంగ తనం చేయలేదనీ, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన దొంగలు చేసి వుంటారనీ మొత్తుకున్నారు.

మల్లిక రోజూ కొత్వాలు ఇంటికి వచ్చి "అయ్యా! నా చంద్రహారం దొరికిందా?" అని అడుగుతోంది.

"దొంగల్ని పట్టుకోవడానికి భటుల్ని పంపించాను. అటు మోటుపల్లి, ఇటు ఓరుగల్లు, కొండపల్లి, కొండవీడు వరకు గూడా వెళ్ళి ఆచూకీ తియ్యమని గట్టిగా చెప్పాను. కంగారు పడకు నీ చంద్రహారం దొరుకుతుంది" అని సర్ది చెప్తున్నాడు కొత్వాలు. నెల రోజులైంది. చంద్రహారం దొరక లేదు. మల్లిక రోజూ తిరుగుతూనే వుంది.

ఒకరోజు కొత్వాలు అడిగాడు. "మల్లికా ఆ చంద్రహారం ఎక్కడ చేయించావు?"

"చిన్న బజారులో నాగలింగాచారి దగ్గర చేయించాను" అని చెప్పింది మల్లిక.

మరునాడు కొత్వాలు నాగలింగాచారిని కలుసుకుని మల్లికకు చేసినటువంటిదే ఒక చంద్ర హారం తయారుచేసి ఇవ్వమనీ, ఆ విషయం రహస్యంగా వుంచమనీ చెప్పాడు. అందుకు కొంత బంగారం ఇచ్చాడు. కొన్నాళ్ళకు నాగలింగాచారి చంద్రహారం చేసి ఇచ్చాడు.

కొత్వాలు మల్లికను ఇంటికి పిలిపించాడు. చంద్రహారం ఆమె చేతికి ఇచ్చి "మల్లికా! నీ చంద్రహారం ఇదేనా చూడు!!" అన్నాడు.

మల్లిక ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయింది.

"నాదే అయ్యగారూ!" అన్నది.

"తీసుకెళ్ళు. ఇక ముందు జాగ్రత్తగా వుండు. గుళ్ళు, గోపురాలు, జాతర్లకు వెళ్ళేటప్పుడు బంగారు నగలు వేసుకెళ్ళకుండా వుంటే మంచిది. కొందరు భక్తితో వస్తే మరికొందరు బంగారం కోసం వస్తారు" అని హెచ్చరించారు.

మల్లిక తల వూపి వెళ్ళిపోయింది.

"ఇదెక్కడి న్యాయమండీ! పోయిన నగ దొరకనే లేదు. నాగలింగాచారి దగ్గర తయారు

చేయించారు గదూ! నగలు పోగొట్టుకున్న వాళ్ళందరికీ తయారు చేయించి ఇస్తారా?'' అని అడిగింది కొత్వాలు భార్య.

"నీ కెలా తెలుసు?'' ఆశ్చర్యంగా అడిగాడు కొత్వాలు.

"నిన్న నాగలింగాచారి తెచ్చి ఇస్తుంటే చూశాను'' అన్నది.

కొత్వాలు నవ్వి "అది అంతే. ప్రజలకొక న్యాయం, రాజుగారికొక న్యాయం వుంటుంది. మల్లిక చెలికత్తే అయినా రాణీగారి ఆశ్రయంలో వుంది. చెలికత్తె నగ పోయిందంటే సాక్షాత్తూ రాణిగారి నగ పోయినట్లే. అది ఎలాగైనా తెచ్చి ఇవ్వాల్సిందే. లేకపోతే మాకు పుట్ట గతులుండవు. ప్రజలైతే మమ్మల్ని నిలదీయ లేరుగా! తమ కర్మ అనుకుని వూరుకుంటారు'' అన్నాడు.

"మరి చంద్రహారం చెయ్యడానికి బంగారం ఎక్కడ్నుంచి తెచ్చారు? మీ జీతంలో నుంచి ఖర్చు చేశారా?'' అని అడిగింది కొత్వాలు భార్య.

"నా జీతంలో ఖర్చు చేయడానికి నేనేం పిచ్చి వాడినా! నెల రోజులు మల్లికను తిప్పింది ఎందుకు? ఈ నెల రోజులూ నగలు వెదకడానికి భటుల్ని దూర ప్రాంతాలకు పంపినట్లూ, వారికి ఇచ్చినట్లు జీతం, భత్యం ఖర్చు రాసి కూడ బెట్టాను. అయినా ఇదంతా మా వ్యాపార రహస్యం'' అని నవ్వుతూ చెప్పాడు కొత్వాలు.

